జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం 11 నవంబర్ 2026 పేజీలు:08



కాంగ్రెస్ ఎస్సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్ము ఆనంద్

నాగర్ కర్నూల్ : నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కొమ్ము ఆనంద్నియమితు లయ్యారు.మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ ఆయనకు నియామక పత్రాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి పార్టీకి ఎంతో కాలంగా సేవలు అందిస్తున్న ఆనంద్ కు తగిన గుర్తింపు లభించిందన్నారు.

మిగతా 2 లో

"పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు..

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా

● ఎదుగుదల లోపాలను ముందే గుర్తించాలి"

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు..
అంగన్‌వాడీ సిబ్బందికి
కలెక్టర్ ఖుష్బూ గుప్తా దిశానిర్దేశం



మహబూబ్‌నగర్, నవంబర్ 10

(ప్రజా జ్యోతి బ్యూరో):

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు, పౌష్టికాహారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. పిల్లల్లో ఎదుగుదల లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్య చికిత్స అందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

మిగతా 2 లో

కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి ఆర్థిక భరోసా

- జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ పాటిల్

నాగర్ కర్నూల్ : నవంబర్ 10 (ప్రజా జ్యోతి)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రామస్వామి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేసారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వ హించి పోలీస్ భద్రత వెల్ఫేర్ అసోసియేషన్ మంజూరు చేసి న పర్సనల్ ఇన్సూరెన్స్ చెక్కును జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ పాటిల్ మృతుడిపుటుంబ సభ్యులకు చెక్కును అందించారు.అకాల మరణం చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణయ్య,ఆర్.ఎస్.ఐ గౌస్ పాషా,పోలీస్ కో- ఆర్డినేటర్ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అటవీ రెవెన్యూ సరిహద్దు సమస్యలు పరిష్కరించాలి

నాగర్ కర్నూల్

నవంబర్ 10

(ప్రజా జ్యోతి బ్యూరో)1

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట..నియోజకవర్గం, పదర మండలం మద్దిమడుగు గ్రామంలో భూభారతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన భూ రీ సర్వే అవగాహన సదస్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో, లతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొని గ్రామస్తులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు.

మిగతా 2 లో

- మద్దిమడుగు గ్రామ అభివృద్ధికి పకడ్బందీ చర్యలు
- భూభారతి కార్యక్రమంలో భాగంగా
భూ రీ సర్వేను నెల రోజుల్లో పూర్తి చేయాలి
- భూ రీ సర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్
హేమంత కేశవ్ పాటిల్



“పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు..

మొదటిపేజీ తరువాయి







జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్టేట్ హోమ్‌లో నిర్వహించిన ‘మన అంగన్‌వాడీ -- మన బాధ్యత’ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. శిశువు జన్మించిన మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆరు నెలల తర్వాత అదనపు పౌష్టికాహారం ప్రారంభించి రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. చిన్నారులకు చిప్స్, చాక్లెట్లు, ప్యాకెట్ ఆహారాలు, శీతల పానీయాలకు దూరంగా ఉంచి, ఇంట్లో తయారుచేసిన సహజసిద్ధమైన పోషకాహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం గుడ్లు, పప్పు, అన్నం, కూరగాయలను నాణ్యతతో అందించాలని స్పష్టం చేశారు. పిల్లల్లో వయస్సుకు అనుగుణంగా శారీరక, మానసిక ఎదుగుదల జరుగుతోందా లేదా తల్లిదండ్రులు నిరంతరం గమనించాలన్నారు. మాటలు పలకడం, శబ్దాలకు స్పందించడం, నిలబడటం, నడవడం వంటి అభివృద్ధి లక్షణాల్లో ఆలస్యం కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.అనంతరం గర్భిణుల కోసం నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పండ్లు, పూలు, గాజులు, చీరలను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. పోషకాహార ప్రదర్శనను సందర్శించి వివిధ ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ రెవెన్యూ సరిహద్దు సమస్యలు పరిష్కరించాలి

మొదటిపేజీ తరువాయి



జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.... మద్దిమడుగు గ్రామానికి ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, భవిష్యత్తులో గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో గ్రామ పరిధిలో భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో, పకడ్బందీగా నిర్వహించి నెల రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.గ్రామ పరిధిలోని అటవీ, రెవెన్యూ భూముల మధ్య ఉన్న సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గతంలో భూ సరిహద్దుల విషయంలో తలెత్తిన సమస్యలు, అపోహలు, వివాదాలను గుర్తించి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అందుబాటులో ఉన్న భూ రికార్డులు, మ్యాపులు, ఇతర ఆధారాలను పరిశీలించి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.భూ రీ సర్వే కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులు రూపొందించేలా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే సమయంలో గ్రామస్తుల అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని, వారికి పూర్తి వివరాలు తెలియజేస్తూ వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.సర్వే పూర్తయిన అనంతరం మరోసారి గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు, సమస్యలు, సూచనలు స్వీకరించాలని తెలిపారు. సంబంధిత శాఖల నివేదికలు, భూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. గ్రామస్తులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర హక్కు పత్రాలు, అందుబాటులో ఉన్న రికార్డులను అధికారులకు అందించి సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంతో భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో అనవసర వివాదాలను నివారించవచ్చని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరి భూ హక్కులకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో స్థల ఎంపికతో పాటు అవసరమైన ఏర్పాట్లపై ముందస్తు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, గ్రామ సర్పంచ్‌తో కలిసి మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్ము ఆనంద్

మొదటిపేజీ తరువాయి

తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టాననికి, జిల్లా అధ్యక్షుడికి ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేస్తానని ఎస్సీల హక్కులు,సంక్షేమానికి,వారి సమస్యలపరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని,గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తాననికాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి,ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు,ఎస్సీసెల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ శ్రీ తిక్క వీరేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అపరిశుభ్రత.. భక్తులు, వాకింగ్ కు ఇబ్బందులు!

మినీ వాటర్ ట్యాంకు పక్కనే మలవిసర్జన.. దుర్వాసనతో ప్రజల అవస్థలు!

ఆలయ పరిసరాల్లో చీకట్లు.. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్!

ఆలంపూర్ నవంబర్ 10(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)







జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ తిక్క వీరేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అపరిశుభ్రత సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవించి ఖాళీ సీసాలను పగలగొట్టి వదిలేస్తుండటంతో ఉదయం వాకింగ్‌కు వచ్చే వారికి ప్రమాదం పొంచి ఉంది. అదేవిధంగామరోవైపు ఆలయ పరిసరాల్లో, మినీ వాటర్ ట్యాంకు పక్కన బహిరంగ మలవిసర్జనతో దుర్వాసన వ్యాపిస్తోంది. సరైన లైట్లు లేక రాత్రి వేళల్లో చీకట్లు అలుము కుంటున్నాయి. అదేవిధంగా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పగిలిన మద్యం సీసాలను తొలగించి, బహిరంగ మలవిసర్జనను అరికట్టి, విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయాలని అయిజ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జన్నప్పపల్లిలో భూ రీసర్వే పనులపై అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన!

- భూ రికార్డుల్లో తప్పులకు తావివ్వొద్దు..

అధికారులకు హరిప్రియ ఆదేశాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ రూరల్ మండలం జన్నప్పపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల తహసీల్దార్‌తో కలిసి గ్రామంలో సర్వే పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే విస్తీర్ణం, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు వ్యవసాయ భూములు, ప్రభుత్వ భూముల విస్తీర్ణాలు, సరిహద్దులు, యాజమాన్య వివరాలను పరిశీలించారు. భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణాలు, యాజమాన్య వివరాలు, భూముల వర్గీకరణ నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి, వ్యత్యాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే సమయంలో రైతులతో సమన్వయం చేసుకుంటూ వారి సందేహాలు, అభ్యంతరాలను రికార్డుల ఆధారంగా పరిష్కరించాలని తెలిపారు. భూ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఖచ్చితమైన భూ రికార్డుల నిర్వహణతో భూ పరిపాలనలో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను నివారించవచ్చని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ డికె. అరుణమ్మ ని, జిల్లా యువ నాయకురాలు డికె.స్నిగ్ధారెడ్డిని ఘనంగా సన్మానించిన రెడ్డి సేవా సమితి సభ్యులు..



ఆలంపూర్ నవంబర్ 10(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

గద్వాల పట్టణంలోని నూతనంగా ఎన్నికైన రెడ్డి సేవా సమితి సభ్యులు మంగళవారం గద్వాల పట్టణంలోని డికె. బంగ్లాలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రెడ్డి సేవా సమితి నూతన సభ్యులు ఎంపీ డీకే అరుణమ్మ కి, డికె.స్నిగ్ధా రెడ్డి కి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డికె.అరుణమ్మ నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, సమాజ సేవలో ముందుండాలని, ఐకమత్యంతో పనిచేస్తూ పేదలకు, నిరుపేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సమాజ అభివృద్ధికి సేవా సమితులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే డికె.



స్నిగ్ధారెడ్డి కూడా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. అదేవిధంగా సమాజంలో ఐక్యత, సేవాభావం, పరస్పర సహకారం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నూతన సభ్యులు నడిగడ్డ రెడ్డి సేవా సమితి అధ్యక్షులు పి. సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. పరమేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు హెచ్. మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి అశోకుమార్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు మారుతి శ్రీనివాస్ రెడ్డి, సంస్కృతిక కార్యదర్శి నరసింహారెడ్డి,మీడియా ఇంచార్జీ .జగదీశ్వర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దినేష్ రెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, మీనాకేతన్ రెడ్డి, ఏ శ్రీనివాస్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి,వై.తిరుమల్ రెడ్డి, బి.నర్సింహా రెడ్డి, బహదూర్ రెడ్డి, యశోధర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి నేటి పర్యటన వివరాలు

నాగర్ కర్నూల్ : నవంబర్ 10 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్.కూచకుళ్ల రాజేష్ రెడ్డి నేడు (బుధవారం)పలుకార్యక్రమాలలో పాల్గొననున్నారు.ఉదయం 10:00 గంటలకు తాడురు మండల పరిధిలోని మెడిపూర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ ను ప్రారంభించి,11:00 గంటలకునాగర్ కర్నూల్ మున్సిపల్ పరిధిలోని దేశిటిక్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 1:00 గంటకు నాగర్ కర్నూల్ పట్టణంలోని 6,వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొని అనంతరంపట్టణ కేంద్రంలో పలు శుభాకార్యలకు హాజరువుతారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది తెలిపారు.



అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న బైకును ఢీకొట్టిన కారు

రెండు వాహనాలు ధ్వంసం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

ఆలంపూర్ నవంబర్ 10(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

గద్వాల మండలం, కుర్వపల్లి గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న బైకును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, బైకు రెండూ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. అలాగే ప్రమాదం జరిగిన సమయంలో బైక్‌పై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగేరోడ్డు పక్కన వాహనాలు నిలిపే సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.





తెలంగాణ చౌరస్తాలో క్రైస్తవుల నిరసన గర్జన.!

- అరుణజ్యోతికి న్యాయం చేయాలంటూ ఐక్యంగా రోడ్డెక్కిన క్రైస్తవ సంఘాలు

- లక్ష్మణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

- మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తే సహించేది లేదని స్పష్టీకరణ

మహబూబ్‌నగర్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

క్రైస్తవుల మత విశ్వాసాలపై దాడులను సహించేది లేదని, బాధితురాలు అరుణజ్యోతికి న్యాయం జరిగే వరకు తమ గళం వినిపిస్తామని క్రైస్తవ సంఘాలు స్పష్టం చేశాయి. అరుణజ్యోతిపై లక్ష్మణ్ అనే వ్యక్తి దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలను నిరసిస్తూ మంగళవారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ మైనారిటీ నాయకులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాధితురాలికి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇచ్చిన పిలుపు మేరకు క్రైస్తవ సంఘాలు ఏకమై తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన మత స్వేచ్ఛను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఎవరి మత విశ్వాసాలను వారు స్వేచ్ఛగా ఆచరించే హక్కును గౌరవించాలని, ఒకరి విశ్వాసాలను మరొకరు కించపరచడం లేదా దాడులకు పాల్పడటం సమాజంలో అశాంతికి దారితీస్తుందని అన్నారు. అరుణజ్యోతిపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దాడి ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మతం ఏదైనా.. విశ్వాసం ఏదైనా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, హక్కులు ఉండాలని నాయకులు పేర్కొన్నారు. మత సామరస్యం, సోదరభావం వెల్లివిరిసే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ హక్కుల పరిరక్షణ కోసం క్రైస్తవ సమాజం ఐక్యంగా, శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ ప్యాట్రన్ రెవ. డాక్టర్ ఎస్. వరప్రసాద్, వైస్ చైర్మన్ బి.ఐ. జాకబ్, సెక్రటరీ జె.ఐ. డేవిడ్, కోశాధికారి టి.ఎ. స్టీఫెన్, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు దాసరి శామ్యూల్ ప్రభాకర్, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షులు కాశపోగు ప్రసాద్, సుందర్ పాల్, పరంజ్యోతి, చర్చి కౌన్సిల్ సభ్యులు, పలువురు పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.







రథోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి: జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

- పాగుంట వెంకటేశ్వర స్వామి జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

గద్వాల నవంబర్ 10(ప్రజా జ్యోతి ప్రతినిధి):

కేటీ దొడ్డి మండలంలోని పాగుంట శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు.మంగళవారం రాత్రి స్వామివారి రథోత్సవం జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్వామివారిని దర్శించుకున్నారు.





అనంతరం జాతర సందర్భంగా పోలీసు శాఖ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు ఆయనకు వివరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.భక్తులు క్యూ లైన్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని,రాత్రి వేళల్లో దొంగతనాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.మహిళలు,యువతుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని,షీ టీమ్స్ నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గద్వాల సీఐ శ్రీను, ఎస్సైలు శ్రీనివాస్,శ్రీకాంత్,శ్రీహరి,తారక్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా దీపావళి పాముకాటు జాతర

- భక్తిశ్రద్ధలతో గంగమ్మకు ప్రత్యేక పూజలు..

బాణసంచా వెలుగుల్లో ఊరేగింపు

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్:

మండల కేంద్రంలో దీపావళి పండుగ సందర్భంగా నిర్వహించే పాముకాటు గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఆడపడుచులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మ ఆలయం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం గంగమ్మ





దేవతను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుద్దులలో కథతో అమ్మవారి ఊరేగింపు కొనసాగగా, బాణసంచా కాల్చుతూ గ్రామస్తులు సంబరాలు జరుపుకున్నారు. దీపావళి పండుగ వేళ గంగమ్మ జాతరతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ వెంకటేష్ గ్రామ ప్రజలు మహిళలు, యువత, గ్రామ పెద్దలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ జాతర గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను చాటిచెప్పింది. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

సంగాల పార్క్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆలంపూర్ నవంబర్ 10 (ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

గద్వాల పట్టణంలోని సంగాల పార్క్ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన వారిగా తెలుస్తోంది.అయితే బైక్ మరో వాహనాన్ని ఢీకొట్టిందా? లేక అదుపుతప్పి కింద పడటంతో ప్రమాదం జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





ఇంటర్మీడియట్ కోర్స్ ప్రవేశాలపై దృష్టి సారించాలి

- కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి విద్యార్థినులకు

- నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందించాలి - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో)

కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు.విద్యార్థినులకు మెరుగైన విద్యా ప్రమాణాలు, సౌకర్యవంతమైన వసతి, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి విద్యా ప్రగతికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన, భోజన ఏర్పాట్లు, ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణ, విద్యార్థుల ప్రవేశాల నమోదు తదితర అంశాలను పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రత్యేక అధికారిని కుసుమ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కేజీబీవీ పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో ముఖ్యమని, నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను..ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులు, విద్యార్థినుల ప్రవేశాల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.160 మంది విద్యార్థులకు గాను 95 మంది విద్యార్థులు ఉన్నారని తెలుపగా, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు 100 శాతం నమోదయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులో నల్లమల్ల అటవీ ప్రాంతంలోని విద్యార్థినిలకు ఏఐ ఆధారిత విద్యను అందించేలా విద్యార్థినుల ప్రవేశాలు మరింత పెరిగేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థినులకు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలను వివరించి, వారిని ప్రోత్సహించాలని సూచించారు.పాఠశాలలో పదో తరగతి



విద్యార్థినులు తెలుగు సబ్జెక్టులో రాస్తున్న స్లిప్ టెస్టును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల వద్దకు వెళ్లి పరీక్ష రాస్తున్న తీరును, ప్రశ్నలకు సమాధానాలు రాసే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.విద్యార్థినులకు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి అదనపు బోధన అందించాలని సూచించారు. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, విషయ పరిజ్ఞానం పెంపొందించుకునేలా బోధన సాగాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థినులకు అందిస్తున్న భోజన సౌకర్యాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు.పాఠశాలలో విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని, వసతి గృహంలో పరిశుభ్రత, భద్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థినుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్



విద్యార్థినులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని, క్రీడా ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేయాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల సంఖ్య, తరగతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అదేవిధంగా అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని తెలిపారు.పాఠశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్, గ్రౌండ్‌ను పూర్తిస్థాయిలో లెవలింగ్ చేసి విద్యార్థినులకు అనువైన ఆటస్థలంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించాలని, శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కేజీబీవీలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థినుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరంపర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట నడింపల్లి గ్రామ సర్పంచ్ గోపి పద్మ, మండల విద్యాధికారి శ్రీనివాస మూర్తి, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

యువత భవిష్యత్తుకు భరోసా.. రూ.10 లక్షల ప్రమాద బీమా

- సొంత ఖర్చులతో యువకులకు బీమా పాలసీలు

- పట్టపర్ల విష్ణువర్ధన్ గౌడ్ అండ్ బ్రదర్స్ దాతృత్వం

రేవల్లి, నవంబరు 10 (ప్రజాజ్యోతి):

యువత భద్రతతోపాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో కేశంపేట గ్రామానికి చెందిన పట్టపర్ల విష్ణువర్ధన్ గౌడ్ అండ్ బ్రదర్స్ ఉదారత చాటుకున్నారు. స్థానిక శివభక్త బృందం ఆధ్వర్యంలో గ్రామ యువకులకు తపాలా శాఖ ద్వారా ఆదిత్య బిర్లా సంస్థకు చెందిన రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీలను తమ సొంత ఖర్చులతో చేయించారు. ఈ సందర్భంగా శివభక్త బృందం సభ్యులు మాట్లాడుతూ.. యువత సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, ఆపద సమయంలో వారి కుటుంబాలకు అండగా నిలిచేలా బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. తమకు అందించిన సహకారానికి విష్ణువర్ధన్ గౌడ్ అండ్ బ్రదర్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శివభక్త బృందం సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా ఎం. చత్రు బాధ్యతల స్వీకరణ

- అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తా: ఎం. చత్రు

మహబూబ్‌నగర్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం. చత్రు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) స్వీకరించారు. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎం. చత్రు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని పేర్కొన్నారు. శాఖలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా విధులు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.అంతకుముందు శాఖ సూపరింటెండెంట్ విజయలక్ష్మి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎం. చత్రుకు స్వాగతం పలికి, కార్యాలయ సిబ్బందిని పరిచయం చేశారు.



నందిపేటలో మండల ప్రత్యేక అధికారి ఆకస్మిక తనిఖీలు

- పాఠశాలలో గుడ్ల పంపిణీలో లోపాలపై ఆగ్రహం..

వారానికి మూడు రోజులు తప్పనిసరిగా అందించాలని ఆదేశం!

మహబూబ్‌నగర్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

మూసాపేట మండలంలోని నందిపేట గ్రామంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించి ప్రభుత్వ శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు.

గ్రామ సమస్యలపై ప్రత్యేక దృష్టి..

గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించిన ఆయన సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో సమావేశమయ్యారు. సుమారు 1,850 జనాభా, 1,180 మంది ఓటర్లు కలిగిన గ్రామంలో ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా పల్లె దవాఖాన ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. మిషన్ భగీరథ ద్వారా ప్రస్తుతం ఒక ట్యాంకుకు మాత్రమే నీటి సరఫరా జరుగుతుండగా, మరో ట్యాంకుకు కూడా నీటిని అందించాలని గ్రామస్తులు కోరారు. అదనపు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిపై స్పందించిన ప్రత్యేక అధికారి సంబంధిత విద్యుత్ శాఖ ఏఈతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ నిర్వహణపై సంతృప్తి..

అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అధికారి చిన్నారులతో ముచ్చటించారు. వారికి అందిస్తున్న పౌష్టికాహారం, సరుకుల నిల్వలు, ఆహార నాణ్యత, కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వారానికి మూడు రోజులు గుడ్లు ఇవ్వాల్సిందే!

నందిపేట మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలను సందర్శించిన గంప శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసి



విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారానికి మూడు రోజులు గుడ్లు అందించాల్సి ఉండగా, కేవలం రెండు రోజులు మాత్రమే ఇస్తున్నట్లు విద్యార్థులు అధికారి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన నిబంధనల ప్రకారం వారానికి మూడు రోజులు తప్పనిసరిగా గుడ్లు పంపిణీ చేయాలని భోజన ఇన్‌చార్జిని ఆదేశించారు. పాఠశాలకు అదనంగా నాలుగు తరగతి గదులు, లైబ్రరీ హాల్, డైనింగ్ హాల్, ప్రహరీ గోడ నిర్మించాలని ప్రధానోపాధ్యాయులు కోరగా, వాటి అవసరాలను అధికారి పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు..

చివరగా గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఓ లబ్ధిదారుడు మరుసటి రోజు నూతన గృహంలో గృహప్రవేశం చేయనున్నట్లు సంతోషంగా తెలపడంతో అధికారి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి!

- పెండింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి..

అధికారులకు అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ ఆదేశం

మహబూబ్‌నగర్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) మంజూరైన అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూధన్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాలు, కేజీబీవీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షిస్తూ, డిప్యూటీ డైరెక్టర్ (ఎస్సీ సంక్షేమం), ప్రత్యేక అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పనుల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ..

మంజూరైన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించాలని అధికారులకు స్పష్టం చేశారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా మరమ్మతులు, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పెండింగ్ పనుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.



విద్యార్థులకు క్లాత్స్ క్లిప్స్ పంపిణీ..

వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఉతికిన దుస్తులను ఆరబెట్టుకునే సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన అదనపు కలెక్టర్ వారి సౌకర్యార్థం క్లాత్స్ క్లిప్స్ పంపిణీ చేశారు. విద్యార్థుల దైనందిన అవసరాలను గుర్తించి చిన్నచిన్న సమస్యలను సైతం పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సునీత, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ లోనే మహిళకు సుఖప్రసవం.. పండంటి మగబిడ్డ జననం

చిన్నంబావి, నవంబర్ 10 (ప్రజాజ్యోతి)

అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి గర్భిణీ మహిళకు అంబులెన్స్‌లోనే సుఖప్రసవం చేశారు. ఈ ఘటనలో తిప్పాపల్లి గ్రామానికి చెందిన మంజుల పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.పెబ్బేర్ మండలానికి చెందిన 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చిన్నంబావి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర సేవలందించారు. తిప్పాపల్లి గ్రామానికి చెందిన మంజులకు తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన చిన్నంబావి 108 అంబులెన్స్ ఈఎంటీ మేకల శ్రీధర్ యాదవ్, పైలెట్ రాఘవేంద్ర, ఆశా కార్యకర్త శ్రీదేవి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు.మంజులను పెబ్బేరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌ను పక్కకు నిలిపారు. ఈఎంటీ శ్రీధర్ యాదవ్ తన వైద్య నైపుణ్యంతో అంబులెన్స్‌లోనే సురక్షితంగా సాధారణ ప్రసవం చేశారు. మంజుల రెండో కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నారని వైద్యులు వెల్లడించారు.ఆపద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లీబిడ్డలను క్షేమంగా కాపాడిన 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీధర్ యాదవ్, పైలెట్ రాఘవేంద్ర, ఆశా కార్యకర్త శ్రీదేవిని క్లిష్ట సమయంలో అంకితభావంతో పనిచేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని మంజుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కొనియాడారు.ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, వనపర్తి జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్ సిబ్బందిని అభినందించారు.



కురుమూర్తి జాతర పరిసరాల్లో 15 రోజుల పాటు మద్యం బంద్.!

- నవంబర్ 10 నుంచి 25 వరకు కల్లు, మద్యం దుకాణాల మూసివేత..

ఐదు కిలోమీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, నవంబర్ 10 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు--2026 సందర్భంగా జాతర పరిసర ప్రాంతాల్లో కల్లు, మద్యం దుకాణాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

నవంబర్ 10 నుంచి 25 వరకు నిషేధం..

తెలంగాణ అబ్కారీ చట్టం--1968లోని సెక్షన్ 20(1) ప్రకారం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నవంబర్ 10వ తేదీ ఉదయం 5 గంటల నుంచి నవంబర్ 25వ తేదీ రాత్రి 10 గంటల వరకు కురుమూర్తి స్వామి జాతర ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో కల్లు దుకాణాలు, ఎ-4 మద్యం దుకాణాలను పూర్తిగా మూసివేయాలి.

ఈ గ్రామాలకు వర్తించే నిషేధాజ్ఞలు..

చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలోని అమ్మాపూర్, దుప్పల్లి, తిరుమలాపూర్, వడ్డెమాన్, అల్లిపూర్, కురుమూర్తి, అప్పంపల్లి, పేరూర్ గ్రామాల్లో ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు..

నిషేధాజ్ఞలను కఠినంగా అమలు చేయాలని సంబంధిత ఎక్సైజ్, పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు, వ్యాపారులు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



నేడుఅలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ .ఏ. సంపత్ కుమార్ పర్యటన వివరాలు..

ఆలంపూర్ నవంబర్ 10(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

నేడు ఉదయం 9 గంటలకు అయిజ పట్టణంలో రాయచూరు చౌరస్తా నుంచి పిఎ.సిఎస్ కార్యాలయం వరకు ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొంటారు. అనంతరంఉదయం 11 గంటలకు అయిజ పిఎ.సిఎస్ చైర్మెన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు అనంతరంమధ్యాహ్నం 12 గంటలకు క్యాతూరు పిఎ.సిఎస్ చైర్మెన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు అనంతరంసాయంత్రం 4 గంటలకు ఎర్రవల్లి నివాసం లో సీఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం. చేస్తారు

రెండవ రోజు తేదీ: 12-11-2026 గురువారం

ఉదయం 10 గంటలకు వడ్డేపల్లి పిఎసి.ఎస్ చైర్మెన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు. అవుతారు అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అలంపూర్ పిఎ.సిఎస్ చైర్మెన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు. అవుతారుఈ కార్యక్రమాలకు అలంపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు అనుచరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

